# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-05-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఉప విద్యాశాఖాధికారి ఉద్యోగాలకు రేపు రాత పరీక్ష నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేర్కొంది.**
2. **పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్లు కేటాయింపునకు సంబంధించిన వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ ను రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి విడుదల చేసింది.**
3. **ఆరో దశ లోక్ సభ ఎన్నికలలో 8 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 58 నియోజకవర్గాల్లో రేపు పోలింగ్ జరుగుతుంది.**
4. **క్షయ వంటి దీర్ఘకాలిక వ్యాధులు సంక్రమించకుండా బీసీజీ వాక్సిన్ వేస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు తెలిపారు.**
5. **రాష్ట్రంలో ఈరోజు, రేపు వడగాడ్పులు వీస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.**

=============================

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్–ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో రేపు ఉప విద్యాశాఖాధికారి ఉద్యోగాలకు రాత పరీక్ష నిర్వహించనున్నట్లు ఏపీపీఎస్సీ అధికారులు తెలిపారు. పరీక్ష ఉదయం 9 నుంచి 11 గంటల 30 నిమిషాల వరకు ఉంటుందన్నారు. ఆన్‌లైన్ విధానంలో పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. అభ్యర్థులను ఉదయం 7 గంటల 30 నిమిషాల నుంచి పరీక్షా కేంద్రం లోపలికి అనుమతిస్తామన్నారు. ఉదయం 8 గంటల 30 నిమిషాల తర్వాత అభ్యర్థులకు పరీక్షా కేంద్రం లోపలికి అనుమతి లేదన్నారు. ఈ విషయాన్ని గమనించి సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

-------------------------

పాలిటెక్నిక్ కళాశాలల్లో సీట్లు కేటాయింపునకు సంబంధించి వెబ్ కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదల చేసినట్లు పాలిసెట్ శ్రీకాకుళం జిల్లా సహాయ కేంద్రం సమన్వయకర్త జి.దామోదరరావు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశ పరీక్షకు హాజరైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ రుసుము చెల్లించి, నిర్దేశించిన తేదీల్లో ధ్రువపత్రాల పరిశీలనకు శ్రీకాకుళం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రానికి హాజరుకావాలని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 250 రూపాయలు, ఓసీ, బీసీ విద్యార్థులు 700 రూపాయల రుసుము జూన్ 2వ తేదీలోగా చెల్లించాలన్నారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన తర్వాత విద్యార్థుల కళాశాల, బ్రాంచ్‌ను ఎంపిక చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. జూన్ 5న కళాశాలలు, బ్రాంచ్‌లు మార్చుకునేందుకు వీలుంటుందని వివరించారు. జూన్ 7న కళాశాలలు, బ్రాంచ్‌ల ఎంపిక జాబితా వెల్లడిస్తామని తెలిపారు.

-----------------------------

లోక్ సభ ఎన్నికల ఆరో దశలో ఎనిమిది రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 58 నియోజకవర్గాల్లో రేపు పోలింగ్ జరగనుంది. ఈ దశ ఎన్నికల ప్రచారం నిన్న సాయంత్రంతో ముగిసింది. ఆరో దశ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లో 14 స్థానాలకు, హర్యానాలో 10, బీహార్, పశ్చిమబెంగాల్ లలో 8 స్థానాల చొప్పున, ఢిల్లీలో 7, ఒరిస్సాలో 6, జార్ఖండ్ లో 4, జమ్మూ కాశ్మీర్లో ఒక స్థానానికి ఎన్నికలు జరుగుతాయి. మొత్తం 889 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది.

-----------------------------

తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి వారిని కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ కార్యదర్శి సంజయ్ జాజు సతీసమేతంగా ఈరోజు దర్శించుకున్నారు. ఆలయంలో టిటిడి అధికారులు సంజయ్ జాజు దంపతులకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు వేద ఆశీర్వచనం చేసి.. స్వామి వారి తీర్థప్రసాదాలను అందజేశారు.

-----------------------------

క్షయ వంటి దీర్ఘకాలిక వ్యాధులు సంక్రమించకుండా ముందస్తుగా బీసీజీ టీకా వేస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామనాథరావు తెలిపారు. నిన్న నంద్యాల జిల్లాలోని చాగల మర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే పాత ఎస్సీ కాలనీలోని 8వ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన బీసీజీ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల జిల్లాలో 5 లక్షల మందికి బీసీజీ వ్యాక్సినేషన్ వేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని చెప్పారు. 18 నుంచి 60 సంవత్సరాలు పైబడిన వారికి ప్రతి గురువారం బీసీజీ టీకా వేస్తామని తెలిపారు.

-----------------------------

మాతా, శిశు మరణాల నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.దిల్లీరావు అధికారులను ఆదేశించారు. నిన్న విజయవాడ కలెక్టర్ కార్యాలయంలో జిల్లాస్థాయి వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు . అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఎన్టీఆర్ జిల్లాలో ఇప్పటివరకు జరిగిన మాతా శిశు మరణాలను సమగ్రంగా విశ్లేషించి వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని, ఇటువంటి మరణాలు సంభవించకుండా భవిష్యత్తు కార్యాచరణను సిద్ధం చేయాలని సూచించారు. మాతా శిశు సంరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకునేలా క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని తెలిపారు.

-----------------------------

త్వరలో జరుగనున్న కౌంటింగ్ ప్రక్రియను సజావుగా నిర్వహించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘం, పోలీసులుపై ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ తెలిపారు. తిరుపతిలోని సిపిఐ కార్యాలయంలో ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్నికల తరువాత పలు చోట్ల ఘర్షణ వాతావరణం చోటు చేసుకుందని చెప్పారు. ఓట్ల లెక్కింపు సమయంలో ఎటువంటి ఘటనలు జరగకుండా శాంతియుత వాతావరణంలో కౌంటింగ్ జరిగేలా ఎన్నికల సంఘం, పోలీసులు చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

-----------------------------

స్ట్రాంగ్ రూముల వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని అనంతపురం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ అన్నారు. గత రాత్రి అనంతపురం జేఎన్టీయూలో సాధారణ ఎన్నికల దృష్ట్యా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను, కౌంటింగ్ కేంద్రాలను, పోస్టల్ బ్యాలెట్ రూములను కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్ట్రాంగ్ రూముల వద్ద నిఘా కొనసాగుతోందన్నారు. కౌంటింగ్ ప్రక్రియకు ఏర్పాట్లు చేస్తున్నామని, అభ్యర్థులు, ఎన్నికల ఏజెంట్ లు స్ట్రాంగ్ రూమ్ ని తనిఖీ చేసిన వివరాలు నమోదు చేస్తున్నామని తెలిపారు.

---------------------------

చిత్తూరు జిల్లాలో తాగునీటి ఎద్దడి నివారణకు అన్నిరకాల చర్యలు చేపడుతున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. నిన్న చిత్తూరులో ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా నీటి ఎద్దడి ఉన్న గ్రామాలను గుర్తించి అనుమతుల మేరకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నట్లు చెప్పారు. జిల్లాలో వర్షాలు కురుస్తుండడంతో సరిపడా నీటి నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నీటిగుంటల ద్వారా భూగర్భ జలాలు పెరిగేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

---------------------------

ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించడానికి అధికారులు సమన్వయంతో పని చేయాలని ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. నిన్న కలెక్టర్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా సంబంధిత అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ, ముందస్తు ఏర్పాట్లతో కౌంటింగ్ సరళిలో సమయాన్ని వృధాకాకుండా చూచుకోవాలన్నారు. కౌంటింగ్ సమాచారాన్ని రాష్ట్ర ఎన్నికల సంఘానికి అందించడానికి అవసరమైన ఇంటర్నెట్ సదుపాయాలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. కౌంటింగ్‌కు కేటాయించిన అధికారులకు, సిబ్బందికి పూర్తిస్థాయిలో శిక్షణ అందించాలని ఆదేశించారు.

---------------------------

సాగు భూమి సారవంతం కోసం రైతులు రెండు లేదా మూడు సంవత్సరాలకొకసారి భూసార పరీక్షలు చేయించాలని దొమ్మేరు వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా.కె.వి.రమణ మూర్తి అన్నారు. ఆచార్య ఎన్ జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చెందిన వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామంలో రైతు సదస్సు, పంట ఉత్పత్తుల ప్రదర్శనను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డ్రోన్ సాంకేతికత, బిందుసేద్యం, సూక్ష్మ నీటిపారుదల, భూసార పరీక్షలు, వర్మీ కంపోస్టు, రైతుభరోసా కేంద్రం సేవలు వంటి అంశాలను విద్యార్థులు నమూనా ప్రదర్శన ద్వారా రైతులకు వివరించారని డా.కె.వి.రమణ మూర్తి తెలిపారు.

---------------------------

వన్యప్రాణుల సంరక్షణలో ప్రజలు సహకారం అందించాలని పార్వతీపురం మన్యం జిల్లా డివిజనల్ అటవీశాఖ అధికారి– డీఎఫ్‌వో ప్రసూన కోరారు. నిన్న పార్వతీపురంలోని డిఎఫ్ఓ కార్యాలయంలో వన్యప్రాణుల సంరక్షణ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జిల్లాలో అరుదైన ప్రాణులు అంతరించకుండా పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రధానంగా మక్కువ, పార్వతీపురం కొండ, వాగుల ప్రాంతాల్లో అరుదైన జీవులు ఉన్నాయని, వాటి రక్షణకు ప్రజలు సమాచారం ఇచ్చి సహకరించాలని సూచించారు.

---------------------------

ప్రకృతి వ్యవసాయంలో నవ ధాన్యాల సాగుకు ప్రభుత్వం ప్రోత్సహకాన్ని అందిస్తోందని కాకినాడ జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి ఎలియాజరు తెలిపారు. కాకినాడ జిల్లాలో ఈ ఏడాది సుమారు 53 వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ శాఖ ద్వారా నవ ధాన్యాల సాగుకు చర్యలు చేపట్టామని చెప్పారు. ఇప్పటికే 26 టన్నుల విత్తనాలు పంపిణీ చేయగా 25 వేల ఎకరాల్లో నవ ధాన్యాల సాగు అవుతోందని చెప్పారు.

---------------------------

రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న క్రమంలో రానున్న రెండురోజులు వడగాడ్పులు వీస్తాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఈ రోజు శ్రీకాకుళం జిల్లాలో 9, విజయనగరంలో 11, పార్వతీపురం మన్యంలో 11, కాకినాడ, తూర్పుగోదావరిజిల్లాల్లో ఒక మండలం చొప్పున మొత్తం 33 మండలాల్లో, రేపు కోస్తాంధ్రలోని 24 మండలాల్లోనూ వడగాడ్పులు వీచే అవకాశం ఉందని తెలిపింది.

======================